www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 నవంబర్ 2023
5
చిత్తూరు



'సావిత్రిబాయిపూలే' ట్యూషన్ సెంటర్ ప్రారంభం



తిరుపతి టౌన్ : టిటిడి వినాయకనగర క్వార్టర్స్‌లో 'సావిత్రిబాయి పూలే' ట్యూషన్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచడమే గాకుండా, స్మార్ట్ ఫోన్‌కు పిల్లల్ని దూరంగా ఉంచుతూ చదువుకు దగ్గర చేసేలా ఈ ట్యూషన్ సెంటర్ నిర్వహణ ప్రత్యేకతని టిటిడి ఉద్యోగ సంఘం నాయకులు జి.వెంకటేశం, గుణశేఖర్, దయాకర్, పద్మనాభం, మురళి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు





ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ... 'ప్రజాభేరి'కి అపూర్వ ఆదరణ పాలకుల అవకాశవాదాన్ని ఎండగడుతూ...

కరువునుంచి గట్టెక్కించండి

సిపిఎం ప్రజాభేరి యాత్రలో ప్రజల విన్నపాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శాశ్వత నీటి ప్రాజెక్టులు లేవు. వర్షాధారమే ఆధారం. ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రమే. వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. చాలాచోట్ల విత్తనాలు వేయకుండా నిలిపేశాం. కరువు నుంచి గట్టెక్కించాలి' అంటూ ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజలు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు సిపిఎం ప్రజా రక్షణ భేరితో బస్సు యాత్ర జిల్లాలో సాగింది. ఈ యాత్రకు కర్నూలు మాజీ ఎంఎల్ఎ, సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ నాయకత్వం వహించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.క్రిష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, ఎం.భాస్కరయ్య, రాష్ట్ర నాయకులు దయా రమాదేవి, శివ నాగరాణితో పాటు ఉమ్మడి జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, వందవాసి నాగరాజు పాల్గొన్నారు. బస్సు యాత్ర ఆద్యంతం కరువు ఛాయలే ఈ బృందానికి కనిపించాయి. రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు కరువు నుంచి తమను గట్టెక్కించాలని, పశువులకు మేత లేదని, పాడి పరిశ్రమ ఆధారంగానే జీవిస్తున్నామని విన్నవించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. ప్రతిసారీ ఎన్నికల్లో ఈ ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లు దండుకుంటారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరిస్తున్నారు. శాశ్వత నీటి పరిష్కారం లభిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు అవసరం లేదు. వ్యవసాయం చేసుకుని బతుకుతాం. వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుంది. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చిన పలమనేరు టెక్స్‌టైల్ పార్కు హామీకే పరిమితమయ్యింది. టమోటా, నిమ్మ, మామిడి కోల్డ్ స్టోరేజీలు మాటలకే పరిమితం. మన్నవరం భెల్ ఫ్యాక్టరీ గుజరాత్‌కు తరలిపోయింది. సిఆర్ఎస్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అడ్రస్ గల్లంతయ్యింది. టిటిడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేస్తామని చెప్పిన హామీని విస్మరించారు. తిరుపతి నగరాభివృద్ధికి టిటిడి బోర్డు నిర్ణయించిన ఒక్క శాతం నిధులకు బిజెపి మోకాలడ్డుతోంది. సిలికాన్ అక్రమ తవ్వకాలు కార్పొరేట్ల వశమయ్యాయి. మత్స్యకారులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదు. సిలికాన్, హోండా, హీరో, అపోలో, శ్రీసిటీల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగాలివ్వాలన్న ప్రభుత్వ జీవో అమలు కాలేదు. సెక్యూరిటీ, వాచ్‌మెన్‌లు, అటెండర్లకే పరిమితమయ్యాం. గ్రామ పంచాయతీ కార్మికులకు 15 ఏళ్లుగా 8వేల జీతంతో బతుకుతున్నాం. పెంచిన పాపాన పోలేదు. తెలంగాణా కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ ఊసేలేదు. ఇప్పటికీ మా జీతం 11వేలే. తెలంగాణాలో 13వేలు. మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. డప్పు కళాకారులకు ఎర్రజెండా పక్షాన పోరాడి సాధించిన పింఛన్ మూడువేలు. ఐదువేలు ఇవ్వాలి. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలి. యాప్‌ల భారంతో వేధింపులు ఎక్కువయ్యాయి. జగనన్న ఇళ్లు పూర్తి చేసి సంక్రాంతి లోపు గృహప్రవేశాలు కల్పించాలి.

– జాతీయ విద్యా విధానం పేరుతో ఆంధ్రప్రదేశ్ లోని ప్రాథమిక పాఠశాలలను జి ఓ 117 పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని. ఈ జీవోను రద్దు చేయాలన్నారు.గూడూరులో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం ఎక్కువ అవుతుందన్నారు.

డీఎస్సీ ద్వారా నియామకం చేయ దానికి కషి చేయాలని యూటీఫ్ నాయకులు కోరారు.



శ్రీకాళహస్తి పురవీధుల్లో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి/రేణిగుంట /గూడూరు

రాష్ట్రంలో భూకబ్జాల పాలన సాగుతోందని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అవకాశవాద అబద్ధాల ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయని 'సిపిఎం ప్రజా రక్షణ భేరి' రాష్ట్ర బృందం ఉద్ఘాటించింది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొనసాగుతున్న దుర్మార్గపాలనను ఎండగడుతూ నవంబర్ 15న విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. బస్సు యాత్ర ఆదివారం ఉదయం తిరుపతి నుంచి బయలుదేరి రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు మీదుగా నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. డప్పులతో అడుగడుగునా ఈ యాత్ర బందానికి ప్రజలు, ప్రజా సంఘాలు, సిపిఎం కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్సీ, ఎస్టీలు, పంచాయతీ కార్మికులు, స్కీం వర్కర్లు వినతుల రూపంలో విన్నవించారు. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరుల్లో జరిగిన సభల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. విభజన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని, ఎటుచూసినా కరువు విలయతాండవం చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ, ప్రైవేట్ భూములను ఎంచక్కా ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ కోట్లు దండుకుంటున్నారన్నారు. ఒక్కో ఎంఎల్ఎ రూ.200 కోట్ల నుంచి 500 కోట్ల రూపాయల వరకూ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, పేద ప్రజలకు జానెడు ఇంటి స్థలం ఇచ్చేందుకు వారికి మనస్సు రావడం లేదన్నారు. తప్పును ప్రశ్నిస్తే అధికార పార్టీ కంటే ముందు పోలీసులే ఓవరాక్షన్ చేస్తూ వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, ప్రజలు శాశ్వతమనే విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ ఎస్ఎస్ కెనాల్ దశాబ్దాలుగా సాగుతూనే ఉందన్నారు. స్థానిక ఎంఎల్ఎ దోచుకోవడం దాచుకోవడం తప్ప, ప్రజా సమస్యలు ఆయనకు పట్టడం లేదని మండిపడ్డారు. గూడూరు నియోజకవర్గంలో పేదలకు భూపట్టాలిచ్చిన భూములు పెత్తందారుల చేతుల్లో ఉన్నాయని, ఇప్పటికైనా ఎంఎల్ఎ, ఎంపి స్పందించి పేదల భూములు పేదలకు అప్పగించాలన్నారు. తిరుపతి అభివృద్ధికి టిటిడి బోర్డు ఒక్కశాతం నిధులు ఇస్తామని తీర్మానిస్తే బిజెపి మోకాలడ్డుతోందన్నారు. గూడూరు నియోజకవర్గంలో సిలికాన్‌ను అధికార పార్టీ నాయకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ యాత్రలో నాయకులు అంగేరి పుల్లయ్య, జనార్ధన్, టి సుబ్రమణ్యం, ఓ వెంకటరమణ, ఎస్ జయ చంద్ర, హరినాథ్, సెల్వరాజ్, రాజేశ్వరి, బుజ్జి, వేణు నరసింహారెడ్డి, గంధం మణి, పెనగడం గురవయ్య, పద్మనాభయ్య, చెంగయ్య, రమేష్, రాపూరు సుబ్రమణ్యం, సంక్రాంతి వెంకటయ్య, గూడూరులో శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు బివి రమణయ్య, సురేష్, బి.చంద్రయ్య, మణి, అడపాల ప్రసాద్, గోపి, ఆర్.శీనయ్య పాల్గొన్నారు.

రేణిగుంటలో... అంబేద్కర్ విగ్రహం వద్ద స్వాగతం పలికారు. ఇక్కడి సభకు మండల కార్యదర్శి కె.హరినాథ్ అధ్యక్షత వహించారు. సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ ఎంఎ గఫూర్ మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర సాగుతోందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం వల్ల మణిపూర్‌లో మహిళలకు రక్షణ లేదని, ముస్లీం, క్రిష్టియన్స్ మత బోధన మసీదులు, చర్చిలపై విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ బిజెపి అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయన్నారు. ప్రజలందరూ చైతన్యం కలిగి బిజెపి మతోన్మాద, నిరంకుశ పాలనను ఓడించాలని పిలుపునిచ్చారు. గువ్వలకాలనీ ఇళ్లు కాపాడాలని గిరిజన నాయుడు అలీబాబా వినతిపత్రం సమర్పించారు.



ప్రజాభేరిలో 'నేను సైతం'



గూడూరులో కళాకారుల గీతాలు



గఫూర్‌ను ముస్లీం మతపెద్దలు కలిసి కోవిడ్ కాలంలో యూపీ రాష్ట్రంలో చిక్కుకున్న ముస్లీంలు స్వస్థలమైన శ్రీకాళహస్తికి చేరుకునేందుకు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, గఫూర్ విశేష కృషి చేశారనివసీమ్ అక్రమ్, మీర్జాన్, ఇస్మాయిల్, రఫీ, అన్వర్ బాషా, మొహిద్దీన్, కలాం, షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు.



నాయుడుపేటలో...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని గద్దె దించాలి


ఎఐటియుసి, సిఐటియు రాష్ట్ర నాయకుల పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని ఎఐటియుసి, సిఐటియు రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు ఎస్‌టియూ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి టి.కోదండ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎఐటి యుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఎండ కట్టారు. దేశంలో రాష్ట్రంలో రైతులు కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ఆదాని, అంబానీలకు కట్టబెట్టి దేశాన్ని, ప్రజలను దగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోడీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడిగే ధైర్యం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం సమన్వయంగా ఐక్య పోరాటాలు చేస్తూ బిజెపి ప్రభుత్వాన్ని, వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరాటం కొనసాగించాలని కార్మిక వర్గానికి, రైతాంగానికి, ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటుపరం చేయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే సపోర్ట్ చేస్తూ జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును కార్మిక వర్గం ఎండగట్టాలన్నారు. నవంబర్ 27, 28 విజయవాడలో జరిగే కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజ, సిఐటియు నాయకులు చైతన్య, సురేంద్ర, సత్యమూర్తి, ఓబుల్‌రాజు, గోపినాథ్, మణి, నాగరాజు, విజయగౌరి, జయలక్ష్మి, ఎఐటియుసి, సిఐటియు, రైతు, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



సురేష్‌బాబు(అధ్యక్షులు)



లీలావతి (ప్రధాన కార్యదర్శి)

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: యుటిఫ్ ఐరాల మండల కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు సారథ్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండల శాఖ ఏర్పడింది. పరిశీలకులుగా సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. ఐరాల మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా ప్రభాకర్, అధ్యక్షులుగా సురేష్‌బాబు, అసోసియేషన్ అధ్యక్షులుగా అరుణ్‌కుమార్, అమ్ములు, ప్రధాన కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా దేవరాజులు, సభ్యులుగా ప్రదీప్, పురందరచౌదరి, రవి, సుధాకర్, త్రివేణి, జనార్ధన్, జిల్లా కౌన్సిలర్లుగా హరి, వెంకటముని, సోమశేఖర్ నాయుడు, అరుణ్ కుమార్, ఏకాంబరం, లీలావతి, వినోద్‌బాబు, విజయలక్ష్మి, రామకృష్ణయ్య, అకడమిక్ కమిటి సభ్యులుగా జనార్ధన్, కుసుమకుమారి, విజయప్రసాద్, ఆడిట్ కమిటి సభ్యులుగా సరోజమ్మ, షబాన, శాంతకుమారి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఐక్యతతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం..

- 8న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని విద్యార్థి, వామపక్ష సంఘాలు ఈ నెల 8న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, తెలుగునాడు, భగత్‌సింగ్ స్టూడెంట్స్ సంఘాల ప్రతినిధులు ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. బంద్‌ను విజయవంతం చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వల్ల సుమారు యాభై నుంచి రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. పరిశ్రమను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే అంతా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఐక్యతతో బంద్‌ను విజయవంతం చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థి సంఘ నేతలు ప్రభుతేజ, గూగుల్‌ఆదిత్య, జగన్, చలపతి, ప్రవీణ్ కుమార్, సురి, ప్రేమ్ చంద్, చైతన్య, తరుణ్, వినయ్, కుల్దీప్, ముని, దుర్గ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జీజేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరంగంపల్లెలో వాలీబాల్ పోటీలు గురజాల జగన్‌మోహన్ యువసేన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదివారం విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న జిజేఎం ట్రస్ట్ చైర్మెన్ జగన్‌మోహన్‌నాయుడు, పూతలపట్టు టిడిపి నియోజవర్గ ఇన్‌చార్జి మురళి, గుడిపాల టిడిపి ఇన్‌చార్జి సుబ్బానాయుడు, నాయకులు అనిల్, మేమాద్రినాయుడులతో పాటు స్థానిక నాయకుల సమక్షంలో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి వేలూరు అవెంజర్స్ రూ. 15,000 ద్వితీయ బహుమతి బంగారుపాళ్యం టీం గెలుపొందగా మొత్తం 8 టీంలకు బహుమతులు ప్రధానం చేశారు. మొత్తం రూ. 50 వేల రూపాయలతో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు బహుతులు, జ్ఞాపికలను అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న జిజేఎం ట్రస్ట్ చైర్మెన్ జగన్‌మోహన్‌నాయుడు

మొదలియార్ కుల సమావేశాన్ని జయప్రదం చేయండి


- రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బుల్లెట్ సురేష్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈ నెల 19వ తేదీ చిత్తూరు మురుకంబట్టు వద్ద ఉన్న కలైబాల కళ్యాణ మండపంలో జరగబోవు మొదలియార్ కులస్థుల సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ తెలిపారు. ఆదివారం న్యూ కాయనికట్టు వీధి వద్ద ఉన్న తమ ఆఫీస్‌లో మొదలియార్ కులానికి సంబంధించిన పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఈ మీటింగ్‌లో పాల్గొని తమ యొక్క సమస్యలను తెలియజేస్తే ఆ సమస్యలను ఉన్నత స్థాయి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-నగరి: ఇటీవల వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ ప్రమాదంలో కీళపట్టుకు చెందిన సంజయ్(డేవిడ్) మృతి చెందగా అతని కుటుంబానికి మంత్రి ఆర్‌కె రోజా ఆదివారం రూ.5లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షలు అందేలా చేశారు. నిరుపేదకు ఆర్థిక సాయం అందేలా చేసిన మంత్రిని పలువురు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, కౌన్సిలర్ యాకోబ్, శ్రీనివాసులు, వజ్రవేలు, రవి, యోవాన్, చిన్నబ్బ, జబరాజ్, సుబ్రమణ్యం, ఆరుముగం, అరుల్ తదితరులు పాల్గొన్నారు.ం౦

దళితుని విచక్షణ రహితంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కల్లూరు పోలీసులు దళిత వెంకటరమణను విచక్షణ రహితంగా కొట్టడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో రోజురోజుకి పోలీసులు ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఆయన విమర్శించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భౌతికంగా అతి దారుణంగా కొట్టడం ఏంటనే ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కు ప్రకారం ఎవరైనా పోరాటం చేయవచ్చని అలాంటి సందర్భంలో దళిత వెంకటరమణ కోర్టు ద్వారా బెయిల్ తెచ్చుకుంటే భరించలేని పోలీసులు ఈ విధంగా చేయడం సరైనది కాదన్నారు. ఇది పూర్తిగా రాజకీయ జోక్యంతో జరిగినట్లు తెలుస్తుందన్నారు. జవాబుదారితనంగా ఉండవలసిన అధికార పార్టీ పుంగనూరు నియోజకవర్గంలో నిత్యం ఇలాంటి గొడవలు జరుగుతున్న మౌనంగా ఉన్నారంటే మౌనమే అంగీకారమా అన్నట్లు అర్థమవుతున్నదన్నారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తూ ప్రతిపక్షాలపై పోలీసుల దాడి చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప భౌతిక దాడులు జరపడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి జోక్యం చేసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇలాంటి సంఘటనలతో నియోజకవర్గంలో సామాన్య ప్రజానీకం భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా గగ్గోల పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపన



అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న డాక్టర్ థామస్‌ం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలపై దాడులు అధికమైయ్యాయని టిడిపి గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ థామస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గంగాధరనెల్లూరులోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై విజ్ఞాపనను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని వైసిపి నేతలు ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలపై అన్ని ప్రాంతాల్లో దాడులు జరుగుతుండటం ఆందోళన కరంగా ఉందన్నారు. వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడుల పట్ల డిప్యూటి సిఎం నారాయణస్వామి స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, వెంకటేష్, గుండయ్య, జ్యోతియాదవ్, సగీకుమార్, శివప్రసాద్, మునిరాజులు యాదవ్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

8న 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎంపి డివో మోహన్‌మురళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులతో పాటు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు సమస్యలను అర్జీ ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి


వందన

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని రైతులందరి సహకారంతో ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేసినట్లు వ్యవసాయ అధికారిణి వందన తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలో 5700 రైతులు ఉండగా 4740మంది పంటలు పండిస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో 8504 ఎకరాల పంటలకు ఈ క్రాప్ నమోదు పూర్తైందన్నారు. రైతులను, ఆర్‌బికె సిబ్బందిని అభినందించారు.

టిడిపిని ఆదరించండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని టిడిపి నేతలు కోరారు. ఆదివారం కార్వేటినగరం పంచాయతీ 87వ బూత్‌లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి మినీ మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, నాయకులు రవియాదవ్, జగన్నాథం, నౌషద్, రవికుమార్, సందని, సోమశేఖర్, సురేష్, కిషోర్, హరి పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఆయన పలు గ్రామాల్లో ఆదివారం ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. వెంగంవారిపల్లి, గౌనిబిమ్మెపల్లి, కడపనత్తం పంచాయితీలకు చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. వారికి మాజీ మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గౌసేషా, నారాయణశెట్టి, నాగరాజప్ప, భాస్కర్‌రెడ్డి, హేమారెడ్డి, నారాయణప్ప, సుందర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు



ప్రజాశక్తి-నగరి: పట్టన పరిధిలో ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఏలా దీపావళికి ముందు వారం సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా అసోసియేషన్ సభ్యులందరికీ బియ్యంతో పాటు దీపావళి పిండివంటలకు అవసరమయ్యే సామగ్రిని కమిటి సభ్యులు అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 20ఏళ్ల నుంచి ఈ సంబరాలు జరుపుకోవడం పట్ల ఆనందంగా ఉందన్నారు. సభ్యులకు అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రవి, కుమార్, అరుణగిరి, ఈశ్వరన్, మురళి, శ్రీనివాసులు, నీలగండన్, హేమాద్రి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు


ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పి బాలికోన్నత పాఠశాలలో ఆదివారం కుప్పం పిఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహతి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 100మందికి వైద్య పరీక్షలు చేపట్టగా 13మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు మహతి ఫౌండేషన్ పి.ఆర్.ఓ.శ్రీనివాసులు, చీలంపల్లి శేషు తెలిపారు.

యువకుడిపై దాడిని ఖండిస్తూ టిడిపి నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-నగరి: ఒంగోలులో గిరిజన యువకుడు నవీన్‌పై పోలీసులు, వైసిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని నగరిలో ఆదివారం టిడిపి నాయకులు నిరసన తెలిపారు. నగరి బస్టాండ్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముళ్లంగి వెంకటరమణ, కంచిక చర్ల యువకుడు శ్యాంకుమార్ తదితరులు పాల్గొని దాడిని ఖండించారు.

ఓటర్ నమోదు కేంద్రాలు పరిశీలన



ప్రజాశక్తి-సోమల: మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు కేంద్రాలను తహశీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు వ్యవసాయశాఖ ఏడి శివకుమార్, డిటి రామ్మూర్తి పరిశీలించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

క్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని టిడిపి వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి మోహన్‌మురళి పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్

ప్రజాశక్తి-కార్వేటినగరం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని గ్రీన్ డెక్కన్ కోఆర్డినేటర్ వీరకంతేశ్వర్ అన్నారు. మండలంలోని కేశంకుప్పం వద్ద వ్యవసాయం పొలంలో ఆదివారం దానిమ్మ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మట్లాడుతూ పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఏపి రైతులకు కార్పొరేట్ బాధ్యత కింద ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉద్యాన పంటలు పెంచేందుకు ముందుకు వస్తే ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అనంతరం తిరుపతి క్లస్టర్ ఎస్ బ్యాంకు మేనేజరు రవిశంకర్, ధనంజయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల వరకు ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు కేశంరాజు, రవిరాజు, లక్ష్మణరాజు, సతీష్, సదాశివ మండడి, పర్వేజ్, రఘు, గణేష్ పాల్గొన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'కు విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన ప్రతి గడపలో అపూర్వ స్పందన వస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కెరోజా తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ గోవిందపాలెం సచివాలయం పరిధిలోని కామరాజనగర్, వడ్డిండ్లులలో గడపగడపకు మన ప్రభుత్వం లో మంత్రి ఆదివారం పాల్గొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును, రాష్ట్రంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎలా అమ లవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడప గడపకి కరపత్రాలు ద్వారా ఎంత లబ్ధి చేకూరాలని వివ రించారు. ప్రజాప్రతి నిధులు, స్థానిక వైసిపి నాయకులు, కార్య కర్తలు ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్, ఏ హరి, వైస్ చైర్మన్లు, డీ జయ ప్రకాష్, డి శంకర్, కమిషనర్ కె ఎల్ ఎంఎన్ రెడ్డి, మున్సిపాలిటీ, డిఈ, ఏఈలు, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్లు, జేసిఎస్ కన్వీనర్, పార్టీ కన్వీ నర్, ప్రజా ప్రతినిధులు వైసిపి కుటుంబ సభ్యులు ముఖ్య నాయకులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు.. ఆనందంలో రైతులు

ప్రజాశక్తి -రామచంద్రపురం: వర్షాలు పడాల్సిన సమయంలో వర్షాలు పడక ఎండమావులతో (అధిక ఎండలతో) గత 20 రోజులుగా ప్రజలు కష్టాలు పడ్డారు. శని, ఆదివారం వరుణుడు కరుణించడంతో మోస్తా రుగా వర్షాలు కురిశాయి. ప్రజలు 'వరుణుడు కరుణించాడు' అంటూ ప్రజలు చల్లటి వాతావరణంతో సంతోషం వ్యక్తం చేశారు. రామ చంద్రాపురం మండలంలో అన్ని గ్రామాలలో వరుణు కరుణించడంతో వర్షాలు కురిసి చల్లటి వాతావరణం తెచ్చింది. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో భారీగా వర్షాలు కురిసి కుంటలు, చెరువులు వర్షపు నీటితో నిండడంతో భూగర్భ జలాల నీటిమట్టం కొంతమేరకు పెరిగింది. ఉద్యానవన పంటలకు కొంత ఉపశ మనం కలిగింది. వరుణ దేవుడు కరుణించక ముందే మండలంలో రైతు ల పండించిన పంటలైన వరి, వేరుశనగ ఒబ్బిడి చేసి ఇంట్లో దాచుకున్నారు. మరి కొంతమంది వేరుశనగ రైతులు పంట దిగుబడి చేసుకోలేక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. వర్షానికి మండలంలో వంకలు వాగులు పొర్లుతున్నాయి. మండలంల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ వర్షానికి ఎలాంటి పంట నష్టం జరగలేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గ్రామాలలో వర్షానికి చిన్నారులు వాన వాన వల్లప్ప అంటూ కేరింతలు వేస్తూ, వర్షంలో తడుస్తూ ఆనందమైన అనుభూతిని అనుభవించారు.

నిషేధిత బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి తిరుపతి సిటీ : గ్రీన్ క్రాకర్స్ ముసుగులో నిషేధిత రసాయనాలతో తయారైన బాణాసంచా బాక్సులపై లేబుళ్లను మార్చి విక్రయించినా, అక్రమంగా నిల్వ ఉంచినా, ప్రభుత్వ అనుమతి లేకుండా విక్రయించినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలను అతిక్రమించి టపాసులు విక్రయించినా నిల్వ ఉంచినా చట్ట ప్రకారం చర్యలు తప్పవు. జిల్లాలో బాణసంచా తయారీ లేదా విక్రయాలు లైసెన్సు కల్గిన వారు ప్రభుత్వ నియమనిబంధలనకు లోబడి ఉండాలని, బాణసంచాలు పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ ఉంచకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయించాలని, షాపుల వద్ద మండే స్వభావం కల్గిన వస్తువులు ఉంచరాదు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకుని బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపుకునేలా చూసుకోవాలనీ. అలా కాదని నిబంధనలకు ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు దీపావళి సందర్భంగా బాణసంచా కొనుగోలు దారులు, అమ్మకం దారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. టపాసులు విక్రయించే షాపుల మధ్య 10 అడుగుల దూరం ఖచ్చితంగా పాటించాలి. బాణసంచా కాల్చేవారు, దీపాలు వెలిగించే వారు తగిన జాగ్రత్తలను పాటిస్తూ కాలుష్య రహిత టపాసులు మాత్రమే కాల్చా లన్నారు. జిల్లాలో తాత్కాలిక బాణసంచా విక్రయాలకు అనుమతులు పొందిన వారంతా నిర్ణీత ప్రాంతంలోనే విక్రయాలు జరపాలన్నారు, ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి ఎవరైనా జనా వాస స్థలాల్లో విక్రయాలు జరిపినా, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడాలని చూసే వారిపై చర్యలు తప్పవని హెచ్చ రించారు.

ప్రాధాన్యతనిచ్చే పార్టీలకే బీసీల ఓట్లు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బీసీలకు ప్రాధాన్యత నిచ్చే రాజకీయ పార్టీలకే తాము ఓట్లు వేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడు స్పష్టం చేశారు. పట్టణం లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. నాగరాజుగౌడ్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికం గా వెనుకబడి ఉన్నారని చెప్పారు. నాయకులు బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప, రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లులో 33 శాతం మహిళా వాటా కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీ కులగణనకు ఆమోదం తెలపడం హర్షదాయకమన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీలకు పెద్దపీట వేయాలనీ, అలాంటి పార్టీలకు మాత్రమే మా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా మఠం దినేష్ ను ఎన్ను కున్నారు. గురు సాయి, సోమశేఖర్ ఆచారి, మధుసూదన్ రావు, కిరణ్ కుమార్, బాల, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు మార్గాన్ని చూపండి..

పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎంతో ఆశతో కొనుక్కున్న ప్లాట్లకు రోడ్డు మార్గం ప్రకృతి విపత్తుల కారణంగా కొట్టుకుపోయిందని, ఇప్పుడు రోడ్డు మార్గం ఏర్పాటు చేసుకోవడానికి శ్రీ చైతన్య కళాశాల భవనం యజమాని అడ్డుపడుతున్నారని తన పల్లి శ్రీరామ్ నగర్ కాలనీ పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ప్లాట్ల దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్లాట్ల దారులు శారద, జయచంద్ర, చంద్రరావు, భాస్కర్ మాట్లాడుతూ తిరుచానూరు గ్రామపంచాయతీ పరిధిలోని తనపల్లి పరిధిలోని సర్వే నంబర్లు 474/1.2, 475/1, 478/1లో బృంద హౌసింగ్ ప్రైవేట్ సంస్థ 1999లో సాయిలక్ష్మి, సాయి సుధా, మైత్రేహి మరికొన్ని పేర్లతో ఫ్లాట్లు విక్రయించారన్నారు. అయితే తమ ఫ్లాట్లకు ఉన్న మార్గాలు గతంలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయాయని, శ్రీ చైతన్య కళాశాల మీదుగా వచ్చే లేఔట్లలో 40 అడుగుల రోడ్డు వేసి దారి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు మార్గం ఏర్పాటు కోసం అనేకమార్లు ప్రభుత్వ అధికారుల చుట్టూ విజ్ఞప్తులు చేసిన ఫలితంగా అధికారులు రోడ్డు వేయడానికి ముందుకు వస్తుంటే శ్రీ చైతన్య కళాశాల భవనం యజమాని ప్రసాద్ అడ్డుకుంటున్నారన్నారు. ఎందుకు అడ్డుకుం టున్నారని ప్రసాద్ ను ప్రశ్నిస్తే ఇది తమ స్థలమంటూ దౌర్జన్యానికి దిగుతున్నాడని, ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్గం వేయాలని విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : పొదలకూరు పోస్ట్ ఆఫీసు ప్రాంగణంలో ఎన్‌ఎఫ్‌పిఈ అధ్వర్యంలో ప్రాంతీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌పి ఈ గూడూరు యూనియన్ నాయకులు గోవింద నాయక్ మాట్లడుతూ పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్‌ఎఫ్‌పి ఈ కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో పొదలకూరు సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ , మురళి , పాండు రంగ రావు , పొదలకూరు, రాపూరు , గుండవోలు , కలిచేడు , సైదాపురం, విరూరు , తదితర ప్రాంతాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కారానికి కృషి


వి.కోటలో వికలాంగుల సంఘ సమావేశం

ప్రజాశక్తి-వి.కోట: వికలాంగుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాల గురునాథ్ తెలిపారు. వికోటలో ఆదివారం వికలాంగుల సంఘం సమావేశం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన గురునాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో రాడోవు వికలాంగుల దినోత్సవం నాటికి ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘ గౌరవ అధ్యక్షులు శంకర్రావు, వెలుగు సిసి మసయ్య, సతీష్, కార్యదర్శి, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు శాంతాబాయి, సునంద, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ పరీక్షల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద చెకుముకి సైన్స్ పరీక్షల గోడపత్రికలను జెవివి సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడు తూ ప్రజల్లో మూఢ నమ్మకాలు పోవాలనే ఉద్దేశంతో విద్యార్థి దశనుండే చైతన్యం రావాలని విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు గత 32సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. చెకుముకి సైన్స్ పరీక్షలు పాఠశాల స్థాయిలో ఈ నెల10వ తేదీ మండల స్థాయిలో, 30వ తేదీ జిల్లా స్థాయిలో, డిసెంబర్17న , రాష్ట్ర స్థాయిలో జనవరి 2024, 27, 28వ తేదీ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, పురుషోత్తమ రావు, రామమోహన్, సాయికిరణ్, గుర్రం విజయబాబు, విష్ణు, కటకం శ్రీను, నక్కా గోపి, పవన్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజావీధిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ , ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర మహిళ మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లడుతూ ప్రతీ నెలా క్రమం తప్పకుండా రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి దాత స్వర్ణలతమ్మ, పరమేశ్వరమ్మ ఐదు వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షులు విష్ణు వందన, మహిళ మండలి అధ్యకురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలత రెడ్డి లక్ష్మి, అనిత, మంజుల, రెడ్ సంస్థ ప్రసిడెంట్ జానా సుధీర్ , మెదురు శ్రీనివాస ఆచారి, అస్లాం పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు స్టేడియం ఇవ్వొద్దు

\- వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దీపావళి సందర్భంగా టపాసుల విక్రయా లకు సంబంధించి దుకాణాల ఏర్పాటుకు గూడూరు పట్టణంలోని అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియాన్ని దుకాణ దారులకు ఇవ్వద్దని వాకర్స్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఉదయం స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. స్టేడియంను టపాసుల దుకాణాలకు ఇస్తే నిత్యం స్టేడియంలో వాకర్స్ కు, క్రీడాకారులకు, ఇబ్బందిగా ఉంటుందన్నారు. అంతే కాకుండా టపాసుల దుకాణాల ఏర్పాటుతో స్టేడియం అస్తవ్యస్తంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్టేడియంలో కాకుండా వేరొక చోట టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల స్టేడియం బురద మయంగా మారిందని ఈ క్రమంలో స్టేడియం లో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే స్టేడియం అస్తవ్యస్తంగా మారు తుందన్నారు. ఉన్నతాధికారులు స్టేడియం విషయంలో వాకర్స్ అసోసి యేషన్, క్రీడాకారులు, గూడూరు పట్టణ ప్రజల విజ్ఞప్తిని పరిశీలించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈతముక్కల వెంకటరామయ్య, శినయ్య, పెటేటి గిరి, మల్లవరపు నాగేశ్వరరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన ద్వారానే సమాజ అభివృద్ధి



ప్రజాశక్తి - క్యాంపస్ : అవినీతి నిర్మూలన కొరకు నిర్వహించిన అవగాహన మారథాన్ రన్ ర్యాలీలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రాంప్రసాద్, విజిలెన్స్ ప్రధాన అధికారి కోర్లం గిరిధర్ సంయుక్తంగా విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవం గురించి ప్రజలకు వివరించి అవినీతి నిర్మూలన ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆదివారం ఉదయం అవినీతి నిర్మూలన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ముగింపు రోజు సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో "అవినీతిని నిర్మూలిద్దాం... భారత దేశాన్ని కాపాడుదాం.." అను నినాదంతో 'విజిలెన్స్ మారథాన్ రన్ ' కార్యక్రమం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం నుండి తిరుపతి టౌన్ క్లబ్ వరకు జరిగిన ర్యాలీ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ , విజిలెన్స్ ప్రధాన అధికారి మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ద్వారానే సమ సమాజ స్థాపన సమాజాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉప ప్రాంతీయ కార్యాలయ అధికారి దాస్యం శ్రీనివాస్, అభిమన్యు, ఎల్డిఎం సుభాష్, ప్రాంతీయ అధికారి సలహాదారు గోపాల కృష్ణ, గుంటూరు రవికుమార్ చీఫ్ మేనేజర్, ఇతర బ్రాంచ్ ల ప్రధాన మేనేజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా


ప్రమాదానికి గురైన కారు

ప్రజాశక్తి-సోమల: టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం మండలంలోని చెన్నపట్నం చెరువువద్ద చోటుచేసుకున్నది. వివరాలు.. బెంగళూరు నుంచి పీలేరులో జరిగే పెళ్లికి ఓ కుటుంబం కారులో బయలుదేరారు. మండలంలోని ఇరికిపెంట చెన్నపట్నం చెరువు మలుపు వద్ద కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తాకొట్టింది. కారులో ఉన్న ఆరు మంది కుటుంబ సభ్యులు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. అటుగా వెళుతున్న తంబళ్లపల్లి శాసన సభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారికి సహాయం అందించాలని స్థానిక సర్పంచ్ రెడ్డెప్పను ఆదేశించారు. బోల్లాపడ్డ కారును స్థానికులు యధా స్థానంలో నిలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు : యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీ పిల్లలకు దాతల సహాయంతో ఒక జత దుస్తులు ఆదివారం పంపిణీ చేశామని యువ నేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధు రాంతకం మునిశేఖర్ తెలిపా రు. ఈ సందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ గిరిజన పిల్లలు బాగా చదువుకుంటేనే ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గిరిజన పిల్లలు బడులకు వెళ్లే విధంగా గిరిజన కాలనీలో ఉన్న పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు ఇకనైనా మారి పిల్లలను చదివించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి యువ నేస్తం అసోసియేషన్ దాతల సహాయంతో కృషి చేస్తుందని తెలిపారు. గిరిజన పిల్లలకు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నేస్తం అసోసియేషన్ మండల కోఆర్డినేటర్ అరుణ, వాలంటీర్లు లక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని తొర్రూరులో టిడిపి మండల అధ్యక్షులు డి.రవికుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డుతూ బాబు ముఖ్యమంత్రి అయితే భవిష్యత్తు గురించి వివరించారు. ఆడబిడ్డ నిధికి ఒక సంవత్సరానికి 18 వేల రూపాయలు, తల్లికి వందనం ఏడాదికి 15వేల రూపాయలు, అన్నదాతకి ఏడాదికి 20వేల రూపాయలు, నిరుద్యోగ భృతి ఏడాదికి 36వేల రూపాయలు, ప్రతి కుటుంబ ఆడబిడ్డకి ఏడాదికి గ్యాస్ సిలిండర్లు మూడు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఆడబిడ్డకి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రాబోయే రోజుల్లో ఆంధ్ర రాష్ట్రంలో వివిధ రకాల కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగులకు అందరికి ఏడాది కాలంలో ప్రతి ఒక్కరికి పని కల్పించే విధంగా బాబు కృషి చేస్తారని, విజన్ ఉన్న నాయకుడిని ప్రజలందరూ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బూత్ కన్వీనర్ మునిందర్ రెడ్డి, మునిరత్నం, ఏలుమలై ఆచారి కిష్టమ్మ, రేవతి, టిడిపి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో మరణించిన వారి పేర్లు తొలగించాలి

ప్రజాశక్తి -గూడూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో మరణిం చిన వారి పేర్లు,గతంలో ఇక్కడ నివాసముండి వేరే ప్రాంతా లకు వెళ్లిన వారి పేర్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని వాటిని తొలగించే విధం గా అధికారులు చర్యలు తీసు కోవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ కోరారు. జనసేన జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మణు క్రాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని పలు వార్డు లలో ఉన్న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ నిర్వ హించారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్ !

- వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు
- జ్వర బాధితులతో ఆస్పత్రులు కిటకిట
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు

ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుతం మంచుతో వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. నగరి నియోజకవర్గంలో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిర్లక్ష్యం వహించకుండా తగిన సమయంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.


రోగులతో కిటకిటలాడుతున్న పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వాతావరణ మార్పులతో జ్వరాల బారిన పడుతున్న వారితో ప్రభుత్వాస్పత్రుల్లో రోజూ ఓపీ సంఖ్య పెరుగుతోంది. చాపకింద నీరులా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వైద్యాధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వుండాలని సూచిస్తున్నారు. ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, కాచీన నీటినే తాగాలని, ఇంటి పరిసరాల్లో వినియోగించని టైర్లు, డ్రమ్ములు ఉంచకూడదని పేర్కొంటున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలని, ఇళ్లలో కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచిస్తున్నారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి కిటకిట

పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి జ్వర పీడితులతో రోజూ కిటకిటలాడుతోంది. పుత్తూరు మండల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నారాయణవనం, వడమాలపేట, నగరి మండలాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తున్నారు. సుమారు నెల రోజుల నుంచి ఈ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సుమారు 150 నుంచి 200 మంది దాకా టైఫాయిడ్, డయేరియా, మలేరియా, డెంగీ జ్వర పీడితులు ఆస్పత్రికి వస్తున్నారు. వారికి ఆస్పత్రి వైద్యులు తగిన వైద్య పరీక్షలు చేసి తక్షణం వైద్యం అందిస్తున్నారు. అయినా జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఆస్పత్రి వైద్యులు అప్రమత్తమయ్యారు. ఇక్కడి వస్తున్న రోగులు అధిక శాతం మంది తాము వారం రోజులకు పైనే ప్రయివేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా వారిచ్చే మాత్రలు, మందులకు తగ్గడం లేదని వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఖర్చు చేసే పరిస్థితి లేక, జ్వరాలు తగ్గక చివరకు ప్రభుత్వ ఆస్పత్రికి రావాల్సి వస్తోందని వాపోతున్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన

సీజనల్ వ్యాధుల నివారణకు ఆస్పత్రి వైద్యులు అప్రమత్తమయ్యారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సైతం ప్రజలకు రోగాల నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. బ్యాక్టీరియాల కలుషిత నీటిని తాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియా, దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటి నివారణ కోసం చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

పటిష్టమైన పారిశుధ్య చర్యలు

పభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాక్టీరియా పెరుగుదలకు ప్రధాన కారణమైన నీటి నిల్వలు లేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది తగిన చర్యలు చేపడుతున్నారు. క్లోరినేషన్ చేయిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పరిశుభ్రతను పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. రోగాల బారినపడిన వారి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా వైద్యంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

సొంత వైద్యం ప్రమాదకరం



జిల్లా వ్యాప్తంగా వివిధ జ్వరాలు విజృంభిస్తు న్నాయి. ఈనేపథ్యంలో సొంత వైద్యం ప్రమాద కరం. సొంత వైద్యం ద్వారా తాత్కాలికంగా జ్వరం తగ్గవచ్చు. అయితే ప్లేట్‌లెస్ తగ్గిపోయి మనిషి నీరసించి కిందపడిపోయే ప్రమాదం ఉంది. జ్వరం తగ్గినా ఒంట్లో నీరసం ఉంటే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేసుకోవచ్చు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. వైద్య సిబ్బంది ఇంటి వద్దకే ఉచిత మందులు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ పి. రవిరాజు, డీఐఓ, చిత్తూరు జిల్లా.